ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## (భీమవరంలో శ్రీనాన్నగారి ప్రవచనము, 1-1-97)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన తల్లితండ్రులు మంచివారా చెడ్డవారా అన్నది మనకు ప్రధానంకాదు. మనకు దేహాన్ని ఇచ్చారు కాబట్టి వారిని గౌరవించాలి. మన డ్యూటీ మనం చెయ్యాలి. వారి మంచిచెడ్డలను భగవంతుడు చూసుకొంటాడు. తల్లితండ్రులమీద గౌరవం లేనప్పుడు. గురువు మీద గౌరవం లేనప్పుడు, భగవంతుడు మీద మాకు గౌరవం ఉంది అని చెప్పినా అది నమ్మటానికి అవకాశంలేదు. నిజమైన స్నేహితుడు నీలో ఉన్నమంచి గుణాలను చూడటానికి ప్రయత్నం చేస్తాడు. మీరంటే ఇష్టంలేనివారు మీలో ఉన్న లోపములను వెతకటానికి ప్రయత్నం చేస్తారు. మానవధర్మం ఏమిటి అంటే కృతజ్ఞత కలిగి ఉండటం. మన తల్లితండ్రులు మనకోసం పడిన శ్రమ, కష్టమునకు మనం కృతజ్ఞత చూపించాలి. అలా చూపిస్తే ఒకవేళ వారికి మనమీద సదభిప్రాయం లేకపోయినా మనం కృతజ్ఞత చూపించినందుకు భగవంతుడు మనలను ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి తీసుకొని వస్తాడు. ఇక్కడ రకరకాలవారు ఉంటారు. మీరు అందరు ఎటువంటి వారో నాకు అనవసరం. మీఅందరి హృదయంలోనూ ఉన్న పరమేశ్వరుడిని చూడటం నేర్చుకుంటే నాకు ప్రపంచం ప్రపంచంలాగ కనబడదు, పరమాత్మలాగ కనబడుతుంది. అప్పుడు నేను బాగుపడతాను.

జ్ఞాని మాట్లాడిన మాటలు అవతారపురుషుడు మాట్లాడిన మాటలు ఎంతకాలం అయితే సూర్యుడు ఉంటాడో, ఎంతకాలం అయితే ఈ భూమి ఉంటుందో అంతకాలం ఆ మాటలు ఉంటాయి. ఆ మాటలకు అంతశక్తి ఉంటుంది. ఎందుచేతనంటే ఏదో ఆశించి చెప్పిన మాటలు కాదు. అహంభావనతో గాని, తాత్కాలిక ప్రయోజనంతో గాని, చెప్పిన మాటలు కాదు. వారి హృదయంలో నుండి వచ్చిన మాటలు. జ్ఞానులు, గురువులు మీమీద బురద చల్లరు. మీకు చల్లదనాన్ని ఇస్తారు. జ్ఞానాన్ని ఇస్తారు. వారి అంతటి వారుగా మిమ్మల్ని చేయటానికి చూస్తారు. మీమీద బురద చల్లటం పనిగా పెట్టుకోరు. బురద చల్లటానికి దేవుడు దిగి రానక్కరలేదు. లోకంలో చాలామంది ఉన్నారు. మనస్సు బాహ్యముఖానికి వెళ్ళినపుడు తలంపులు విజృంభిస్తాయి. మనస్సు అనేకరకాల బంధాలలో ఇరుక్కొంటుంది. అదే మనస్సు అంతర్ముఖమయితే పల్చబడుతుంది. పల్చబడటమే కాదు ఆత్మాకారం చెందుతుంది. మనస్సు కదలటానికి కారణం ఏమిటి ? అందరికి ఒకే కారణం వలన మనస్సు బాహ్యముఖానికి వెళ్ళదు. ఒకో మనిషికి ఒకో బలహీనత వలన మనస్సు బాహ్యముఖానికి వెళుతుంది. నీలో బలహీనతలు లేకపోతే అది బయటకు వెళ్ళమన్నా వెళ్ళదు. మీ మనస్సు ఆగమంటే ఆగటం లేదు, నా మనస్సు కదలమంటే కదలటం లేదు అనేవారు భగవాన్. నిన్ను ఒక కులానికి, ఒక మతానికి, ఒక దేహానికి పరిమితం చేసే మనస్సును నశింపచేస్తేగాని హద్దులు లేని స్థితికి ఎదిగి వెళ్ళలేవు. పరిమితులను, హద్దులను కల్పించేది దేహగతమైన నేను. పరిమితుల నుండి బయటకు తీసుకొని వచ్చేది ఆత్మజ్ఞానం. బ్రహ్మంలో బహుళత్వం, అనేకత్వం లేదు. జ్ఞాని యొక్క గొప్పతనం ఏమిటి అంటే అనేకత్వంలో ఏకత్వం చూస్తాడు. అనేకత్వంలో ఏకత్వంచూడటం ఎప్పుడైతే నేర్చుకొన్నాడో అప్పుడు వాడికి మలినం అంటదు. ద్వైతభావనలో నుండి విడుదల పొందుతాడు. నీకు

భిన్నభావన, బంధభావన కలిగించేది దేహగతమైన నేను. అది నశించాక భిన్నభావన లేదు. జ్ఞానికి బాహ్యమైన ఆకర్షణలు ఏమీ ఉండవు. ఎవరిని చూసినా ఉన్నది ఒకటే చూస్తాడు. అనేకం చూసినపుడు, భిన్నత్వం చూసినపుడు మోహం కలుగుతుంది. మోహంలో నుండి ఆకర్షణ కలుగుతుంది. ఆ వాసన వెనకాల కొట్టుకొని పోతాము. ఏవిషయాలు అయితే నీ మనస్సు చలించటానికి కారణమో ఆవిషయాలనుండి నీ మనస్సును విడదీయి. అదే వైరాగ్యం. వైరాగ్యం లేకపోతే నీకు జ్ఞానం కలుగదు.

మోక్షం గురించి, ఆచివరి స్థితి గురించి చెప్పటంలో ఒక మతానికి, ఇంకో మతానికి, బేధం ఉండవచ్చును గాని ఇంద్రియ నిగ్రహం గురించి, మనోనిగ్రహం గురించి అన్ని మతాలు చెప్పాయి. నేను అనే తలంపు మూలంలో నుండి వచ్చింది అనటం కంటే దేవుడి దగ్గర నుండి వచ్చింది అంటే బాగుంటుంది. ఆమూలమే దేవుడు, చైతన్యం. నీ మనస్సు నశిస్తే నీవు పోవు, నీవు ఎవరో నీకు తెలుస్తుంది. నీమనస్సు ఉన్నప్పుడు, నీ మనస్సు లేనప్పుడు, నీ దేహం ఉన్నప్పుడు, నీ దేహం లేనప్పుడు కూడా నువ్వు ఉన్నావు. మధ్యలో మనస్సు వస్తోంది, దేహం వస్తోంది, లోకం వస్తోంది. ఇవి అన్నీ వస్తున్నాయి, పోతున్నాయి అయినా నువ్వు ఉన్నావు. ఇప్పుడు కూడా నువ్వు ఉన్నావు. ఎప్పుడూ ఉండే నువ్వు నిజమా లేక మధ్యలో వచ్చి మధ్యలో పోయేవి నిజమా ? నేను చనిపోయిన తరువాత ఏమౌతాను అని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగాడు. చనిపోయిన తరువాత సంగతి ఎందుకు చనిపోయిన తరువాత ఏమవుతాను అనుకొనే బదులు ఇప్పుడు నీవు జీవించే ఉన్నావు కదా ఇప్పుడు నీవు ఎవరో నీవు తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి అని చెప్పారు.

నిన్ను ఎవరైనా పొగిడితే పైకి నిర్మలంగా ఉన్నట్లుగా కనిపించినా మనస్సులో సంతోషం వస్తుంది. ఎవరైనా విమర్శించినపుడు పైకి దుఃఖం రాకపోయినా లోపల వికారం వస్తుంది. నీ మనస్సులో వచ్చే వికారములనుండి బయటకు వస్తే మనస్సు పల్చబడుతుంది. హృదయాభిముఖంగా ప్రయాణిస్తుంది అంటే దాని మూలం లోనికి అది వెళుతుంది. నీ మనస్సు దాని మూలం లోనికి వెళుతూ ఉంటే దానికి ఉన్న పరిమితులు పోయి అది విశాలం అవుతుంది. దేహగతమైననేను పోతే నిజమైననేను తానుగా వచ్చి మిమ్మల్ని వరిస్తుంది. వరించడమే కాదు తన స్వరూపాన్ని ఇస్తుంది. నీ పూజ, జపం, ధ్యానముల యొక్క గమ్యం మనస్సును ఉపసంహరించటం. సత్వగుణాన్ని అలవర్చుకోవాలి అంటే తమోగుణం, రజోగుణం వచ్చి సత్వగుణంలో కలవకుండా చూసుకో. చేసే సహవాసముల విషయంలో జాగత్త అవసరం. ఆత్మజ్ఞానం సంపాదించుకోవాలి అంటే చాలా జాగ్రత్తగా ఉండాలి, మెలకువగా ఉండాలి. కత్తి అంచు మీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా నడుస్తాడో అంత జాగ్రత్తగా నీవు జీవిస్తే బ్రహ్మం నిన్ను వరిస్తుంది. నీదేహం ఎక్కడ ఉంది అనేది ముఖ్యం కాదు. భగవంతునితో మానసిక అనుబంధం పెట్టుకుంటే ఇంజను ఏవిధంగా పెట్టెలను లాగుకొని పోతుందో ఆ అనుబంధం నీ మనస్సును లాగుకొనిపోయి, నీ మనస్సును నశింపచేస్తుంది. నీ మనస్సును నశింపచేసి ఊరుకోడు. భగవంతుడు అనుగ్రహించి తన స్వరూపాన్ని ఇస్తాడు. నీ దేహబుద్ధి నశించిన మరుక్షణంలో సృష్టికి ఆధారంగా ఏ వస్తువు అయితే ఉందో అదే నీకు నేనుగా వ్యక్తమవుతుంది. భగవంతునిపట్ల విశ్వాసం కలిగి ఉంటే, భగవంతుడిని ప్రేమిస్తూ ఉంటే, భగవంతుడు సంతోషించే పనులు చేస్తే, సత్కర్మ చేస్తే పునర్జన్మ హేతువులను భగవంతుడు నశింపచేస్తాడు. నీకు శాంతి కావాలంటే ఇతరులలోని బలహీనతలను, లోపాలను వెతకటం మానివెయ్యి.

రమణమహర్షిగారు ఏది మాట్లాడినా నిరహంకారముగా మాట్లాడతారు, ఏపని చేసినా నిరహంకారముగా

చేస్తారు. ఆయన యొక్క వైభవం చూడండి. ఆయన మాటలో, చేతలో, దైనందిన జీవితంలో, ఆయన ప్రవర్తనలో ఎక్కడా వ్యక్తిత్వం కనబడదు. నాకు మీరు జ్ఞానమును ప్రసాదించాలి అని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగితే నేను నీకు జ్ఞానమును ఇస్తాను అని ఆయన చెప్పలేదు. ఏ ఈశ్వరుని అనుగ్రహం వలన నాకు జ్ఞానం కలిగిందో ఆఈశ్వరుని అనుగ్రహం వలననే నీకూ జ్ఞానం కలుగుతుంది అని చెప్పారు. వాడు రమణ మహర్షి. దీనిని బట్టి ఆయన ఏ అంతస్తులో ఉన్నాడో చూడండి. ఇలా విభూతి తెప్పించాము రోగము తగ్గిపోయింది అంటే అది జ్ఞానం కాదు. మాకు కడుపులో నొప్పి వచ్చింది మిమ్మల్ని చూసిన తరువాత తగ్గింది అంటే అది జ్ఞానమా ?తగ్గిపోతే తగ్గిపోవచ్చును. అది వేరే విషయం. అది జ్ఞానమా?

## (పాలకొల్లులో శ్రీనాన్నగారి ప్రవచనము, 19-1-97)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతునికి కాలము, దూరము లేదు. కాలము, దూరము మనస్సుకు సంబంధించినవి. భగవంతుడు లేని చోటు అంటూ లేదు. ఆయన అన్ని కాలాల్లో ఉన్నాడు, అంతటా నిండి ఉన్నాడు. ఆయన జ్ఞానపూర్ణుడు, శాంతిపూర్ణుడు, మహాగురువు. భగవంతుని పట్ల ప్రేమ కలిగి ఉండి, భక్తి కలిగి ఉండి ఆయనను ఆరాధించగా, ఆరాధించగా మనం చేసిన పూజలకు, జపాలకు, ధ్యానాలకు స్పందించి ఆకారం లేని దేవుడు మనకోసం ఒక ఆకారం ధరించి గురురూపంలో వచ్చి జ్ఞానాన్ని బోధిస్తాడు. దేవుడు ఎక్కడో ఉన్నాడు అనుకొంటున్నావు కాని నేను నీ హృదయంలోనే ఉన్నాను అని ఆయన మనకు బోధిస్తాడు. మన హృదయంలో ఉన్న భగవంతుడు మనకు తెలియకపోవటానికి కారణం మన అజ్ఞానం. ఆత్మజ్ఞానమును బోధించి అజ్ఞానమును నశింపచేయటానికే ఈశ్వరుడు గురురూపంలో వస్తాడు. మంచిగుణాలతో ఉండు, మంచి చేయి అని గీతలో కృష్ణుడు చెప్పాడు. మంచితనం గమ్యం కాదు. కాని మంచితనం గమ్యం చేరటానికి సహకరిస్తుంది. మంచి పనులు చేయటం వలన జీవుడు హృదయాభిముఖంగా ప్రయాణం చేసి హృదయంలో కరిగి పోతాడు. జీవుడు ఎప్పుడైతే హృదయంలో కరిగిపోయాడో అక్కడ ఉన్న ఈశ్వరుడే నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. అప్పుడు దేహం ఉన్నా, లేకపోయినా మనం ముగింపు లేని సుఖాన్ని, శాశ్వతమైన శాంతిని పొందుతాము.

భగవంతుని తెలుసుకోవాలి అని మనం అనుకొంటున్నాము. కానీ చిన్న కష్టం వస్తే మనం తట్టుకోలేము. ఎవరైనా మిమ్మల్ని పొగిడితే పట్టుకోలేము, పొంగిపోతారు. ఎవరైనా విమర్శిస్తే కృంగిపోతారు. ఇటువంటి స్వల్ప మనస్కులకు, బలహీనులకు ఆత్మజ్ఞానం కలుగదు. ఉన్నది ఒకటే అనుభవం. దేనికైతే చావు, పుట్టుకలు లేవో దానిని ఎవడైతే అనుభవం లోనికి తెచ్చుకున్నాడో అదే నిజమైన అనుభవం. అదే నిత్యమైన అనుభవం. అదే ఆత్మానుభవం. మిగిలిన అనుభవాలు అన్నీ మనస్సుకు పరిమితమైనవి. నీమనస్సు ఎంత నిజమో ఆ అనుభవాలు కూడా అంతే నిజం. జ్ఞానమును సంపాదించుకొంటే గాని అజ్ఞానము నశించదు. అజ్ఞానము అనే చీకటి నుండి బయటకు తీసుకొనివచ్చి వెలుగును చూపించేవాడే గురువు. మనలను ప్రేమించేవాడు, మనకు జ్ఞానం కలగాలి అని మనకోసం తపించేవాడు, మనకోసం జీవించేవాడు గురువు. మన హృదయంలో ఉన్నవస్తువు గురించి బోధించి, దాని ప్రాముఖ్యత గురించి చెప్పి, ప్రాముఖ్యత గురించి చెప్పటమే కాకుండా ఆ వస్తువు యొక్క సమీపంలోనికి తీసుకొనివెళ్ళి, సమీపంలోనికి తీసుకొని వెళ్ళటమే కాకుండా ఆ వస్తువును మనచేత పొందింపచేసి దానికి సంబంధించిన సుఖాన్ని, శాంతిని మనకు అందేటట్లు

చేసేవాడు గురువు.

మనం శరీరానికి ప్రాముఖ్యత ఇస్తున్నాము గాని మనస్సుకు ప్రాముఖ్యత ఇవ్వటం లేదు. దేనిచేత శరీరం నడపబడుతోందో, ఇంద్రియాలను గోళాలుగా ఉపయోగించుకొని నీలోపల ఉండి ఏ మనస్సు అయితే పని చేస్తోందో ఆ మనస్సును బాగు చేసుకోవటానికి మనం ప్రయత్నం చేయటం లేదు. మనస్సుకు నాశనం ఉంటుందా అని అడిగితే నీకు ఆత్మజ్ఞానము కలిగితే మనస్సు నశిస్తుంది అని ఆచార్యులవారు చెప్పారు జ్ఞానం కలగాలి అంటే మీరు అనుకొన్నంత కష్టంకాదు. రూపంతోటి, నామంతోటి తాదాప్యం విడిచిపెడితే, కర్తృత్వ బుద్ధిలోనుండి విడిపోతే నీకు జ్ఞానం కలుగుతుంది. జీవితంలో సుఖం, దుఃఖం వస్తూ ఉంటాయి. ఏదివస్తే ఆ ప్రవాహంలో కొట్టుకొని పోకూడదు. సుఖం వచ్చినపుడు ఎవడైతే పొంగిపోతున్నాడో, దుఃఖం వచ్చినపుడు ఎవడైతే కృంగిపోతున్నాడో వాడిలో నుండి వేరుపడితే నీకు కష్టం వచ్చినపుడు అది కష్టంలాగ అనిపించదు, సుఖం వచ్చినపుడు అది సుఖంలాగ అనిపించదు. కర్తృత్వం నుండి ఎప్పుడైతే విడిపోయారో జీవితంలో వచ్చే హెచ్చుతగ్గులు మిమ్మల్ని ముట్టుకోవు. ప్రాక్టీసు చేస్తే మీకే తెలుస్తుంది.

నీరు దానంతట అది పల్లం వైపుకు ప్రయాణిస్తుంది. అదేవిధంగా నీ మనస్సుకు ఉన్న కుయుక్తులు, కుతంత్రాలనుండి నీ మనస్సును విడుదలచేస్తే నీ మనస్సు దానంతట అదే సహజముగా హృదయం వైపుకు ప్రయాణించి హృదయంలో కరిగి పోతుంది. సృష్టి రహస్యం అంతా హృదయంలో ఉంది. హృదయం లో నుండి మనస్సు వస్తోంది. మనస్సును బట్టి దేహం వస్తోంది. దేహాన్ని బట్టి లోకం వస్తోంది. దేహం ఉన్నవాడికి లోకంగాని దేహం లేనివాడికి లోకం ఏమిటి ?నీశరీరాన్ని మాత్రం నీ తల్లితండ్రులు ఇస్తారు. గుణాలను తల్లితండ్రులు ఇవ్వరు. గుణాలను, సంస్కారములను, అలవాట్లను నీవు పూర్వజన్మ నుండి తెచ్చుకొంటావు. భయాన్ని విడిచిపెట్టు, రాగాన్ని విడిచిపెట్టు, కోపాన్ని విడిచిపెట్టు అని గీతలో చెప్పాడు. ఎవడు ఏ మార్గంలో ప్రయాణం చేసినా, ఏమతంలో ఉన్నా, ఏ దేవుడిని ఉపాసన చేసినప్పటికి భయం, రాగము, ద్వేషము ఈ రుగ్మతలనుండి బయటకు వస్తేగాని మోక్షస్థితిని పొందలేడు. రాగ ద్వేషములు కామ క్రోధములు, భయాలు, ఇవి అన్నీ పునర్జన్మకు కారణం అవుతున్నాయి. ఇవి అన్నీ బయటకు వస్తేగాని మోక్షస్థితి కలుగదు. ఈ ఆవరణలో దుమ్ము ఉంది అనుకోండి చీపిరితో ఆ దుమ్మును తుడిచేస్తే శుభ్రం చేయగలము ఆలాగే నీ మనస్సులో ఉన్న రుగ్మతలను తొలగించినపుడు మాత్రమే నీకు అమృతస్థితి కలుగుతుంది. మనస్సులో ఉన్న దుమ్మును అంతా బయటకు తీసుకొని రావటానికే ఉపాసన. భగవంతుడిని భక్తితో ప్రేమించండి. మీకు ఏది మంచిదో తెలియకపోయినా మీరు ప్రేమించే భగవంతునికి తెలుసు. నీ మనస్సును పవిత్రం చేయటానికి, మనస్సును క్రమశిక్షణలో ఉంచటానికి పూజ, జపం, ధ్యానం ఉపయోగపడతాయి. ఇవి అన్నీ రెండవ పక్షం. నీవు పరమ పవిత్రుడవు అవ్వటానికి పూజ, జపం, ధ్యానం వీటి అన్నింటికంటే గురువు అనుగ్రహం అత్యంత ప్రధానమైనది. భగవంతుని అనుగ్రహం లేకుండా భగవంతుని పొందలేవు. భగవంతునికి ఇష్టమైన పనులు, భగవంతుని ప్రీతికోసం ఏ సాధకుడు అయితే చేస్తున్నాడో వాడు భగవంతుని అనుగ్రహానికి పాత్రుడవుతాడు. దేవుని అనుగ్రహం ఎప్పుడైతే కలిగిందో అప్పుడు దేవుడే నీకు నేనుగా వ్యక్తమవుతాడు. అందువలన భగవంతునికి ఇష్టమైన పనులు ఆయన చెప్పినట్లుగా మనం చేయాలి. బాహ్యంగా మనం కొన్ని మంచి పనులు చేస్తాము. చాలా గౌరవం సంపాదించుకొన్నాము అనుకొంటాము. మన అహంకారమును ఉబ్బించు కొంటాము. కానీ మూలంలో మనం నాశనం అయిపోతున్నాము అన్న సంగతి మనకు తెలియటంలేదు. వాపు వేరు, బలం వేరు. వాపును చూసి బలం అనుకోవద్దు. మీ

అజ్ఞామును, అహంకారమును, సంకుచితమనస్సును చూసి పొంగిపోకండి. అది జ్ఞానం కాదు. ఒక్కసారి మిమ్మల్ని మీరు చూసుకోండి. మీ మనస్సును అంతర్ముఖం చేసి చూసుకోండి. మీలో ఎన్ని సంకుచిత భావాలు ఉన్నాయో మీకే తెలుస్తుంది. ఈ లోకం అంతా రాగ, ద్వేషములతో నిండి ఉంది. ఈ రాగ, ద్వేషములనుండి ఎవడైతే విడుదల పొందాడో వాడి మనస్సు మాత్రమే ఏకాగ్రం అవుతుంది, పవిత్రం అవుతుంది. వాడి మనస్సు మాత్రమే మోక్షం పొందటానికి అర్హత సంపాదిస్తుంది. మనస్సుతో విరోధం పెట్టుకోవద్దు. మనస్సును స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి. మనస్సు పవిత్రం అవ్వటానికి మన ఇంద్రియాలు మనకు సహకరించాలి. కోరికలకు ముగింపు లేదు. నీకు ఏదైనా కోరిక వస్తే దానిని సాటిస్ఫై చేయకు. దానిని కంట్రోలు చేయి. కోరికను సాటిస్ఫై చేయటం కంటే దానిని కంట్రోలు చేయటం వలన నీకు ఎక్కువ శాంతి, ఆనందం వస్తాయి.

నీకు జ్ఞానం రాకుండా ఎవరో ఇతరులు అడ్డు రావటం లేదు. నీస్నేహాలే అడ్డువస్తున్నాయి. మనం వివేకంగా జీవించటానికి పనికివచ్చే పుస్తకాలు చదవాలి. ఈ లోకానికి, పరలోకానికి పనికివచ్చే స్నేహాలు అంటే జ్ఞాన సముపార్జనకు ఎవరైతే సహాయపడతారో వారితో సహవాసం చెయ్యాలి. నీ హృదయంలో సత్య వస్తువు ఉంది. దానితో సహవాసం చెయ్యి. దానితో సహవాసం కుదరకపోతే బాహ్యంగా ఉన్న సత్పురుషులతో సహవాసం చెయ్యి. మనలో ఉన్న వాసనలు నశిస్తేనేగాని ఆత్మజ్ఞానం కలుగదు. ఆత్మజ్ఞానం కలిగితేగాని వాసనలు నశించవు. ఇది ముందా, అది ముందా అనే వాదన వేసుకోవద్దు. రోగంవచ్చినపుడు దాని నివారణకు ఒకప్రక్క మందు వాడాలి, రొండోప్రక్క దానికి సంబంధించిన పత్యంచేయాలి. అలాగే ఒకప్రక్క ఆత్మజ్ఞానము సంపాదించుకోవటానికి ప్రయత్నం చేయాలి. రెండవ ప్రక్క వాసనాబలమును తగ్గించుకొంటూ ఉండాలి.

ప్రాథమిక అవసరాలు ఉన్నంత మాత్రంచేత నీకు శాంతి కలుగదు. నీ శాంతికి ఇంట్లో వ్యక్తులు గాని, బాహ్యమైన పరిస్థితులు గాని కారణంకాదు. నా అశాంతికి అహంభావనే కారణం. అందు వలన అహంభావన పల్చబడేటట్లు చూసుకోవాలి. నీ అజ్ఞానం, నీ అహంభావన అంటే నీకు చాలా ఇష్టం కాని దానిని తొలగించుకోమని భగవంతుడు చెపుతున్నాడు అందువలన దానిని తొలగించుకోవాలి. మీకు దేవుడు కావాలంటే దేవుడు ఏ అహంభావనను తొలగించుకోమని చెపుతున్నాడో మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా దానిని తొలగించుకొంటే మీకు దేవుడు తెలుస్తాడు. అజ్ఞానమును తొలగించుకోవటం ఎవరికీ ఇష్టం లేదు ఎందుచేతనంటే దానివలన వచ్చే కష్టాలు, నష్టాలు మనకు తెలియటంలేదు. భగవంతుడు అజ్ఞానమును తొలగించుకోమని చెబుతున్నాడు కాబట్టి నీవు ఏమీసందేహించకుండా దానిని తొలగించుకొనే ప్రయత్నం చెయ్యి. మోక్షం వచ్చి నిన్ను వరిస్తుంది.

మనకు మొదట నేను అనే తలంపు వస్తోంది అది ప్రధానతలంపు. దానికి ఇతర తలంపులు వస్తున్నాయి. భయం, కోపం, ఇష్టం ఇవిఅన్నీ నేను అనే మొదటితలంపుకు వస్తున్నాయి. మనలో ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో ఆనేను ఎవరు? అని ప్రశ్నించుకోవాలి. మనస్సును నిగ్రహించుకోవటానికి నేను ఎవడను? అనే ప్రశ్న నీకు సహకరిస్తుంది. మనస్సు భగవంతుని వైపుకు ప్రయాణం చేయటానికి నేను ఎవడను? అనే ప్రశ్న ఉపయోగపడుతుంది. నేను ఎవడను? అనే ప్రశ్న ఎక్కడైతే ఆనందం ఉందో, శాంతి ఉందో అక్కడకు నిన్ను తీసుకొని పోతుంది. ఒక చెట్టును నరకటానికి గొడ్డలి ఏవిధంగా ఉపయోగపడుతుందో అజ్ఞానం అనే మహావృక్షమును నరకటానికి నేను ఎవడను? అనే ప్రశ్న అలాగ ఉపయోగపడుతుంది. అజ్ఞానం ఉంటే జీవుడు, అజ్ఞానం పోతే నువ్వే దేవుడవు. దేవుడు ఏ సుఖాన్ని, శాంతిని, ఆనందమును అనుభవిస్తున్నాడో నీలో అజ్ఞానం నశించినపుడు ఆ సుఖము, శాంతి, ఆనందమే నీకు స్వరూపంగా వ్యక్తమవుతాయి. సినిమా తెర ఎప్పుడూ అలాగే ఉంటుంది. బొమ్మలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. అలాగే ఈ భూమి అలాగే ఉంటుంది. జీవుడు వస్తూ ఉంటాడు, పోతూ ఉంటాడు అంటే కొత్త శరీరాలు వస్తూ ఉంటాయి పాత శరీరాలు పోతూ ఉంటాయి. ఈ లోకంలో ఉండగానే

ఈదేహంలో ఉండగానే నీలోని జీవలక్షణాలను, ప్రకృతిలక్షణాలను కాల్చి బూడిద చేసుకొంటే నీకు ఇంక ప్రయాణములు ఉండవు.

ఈ దేహంలో ఉండగానే ఏమనస్సు అయితే నీకు నేనుగా వ్యక్తమవుతోందో దానిలో నుండి విడిపోతే అంటే మనస్సులో ఉన్న గుణాలనుండి, వికారములనుండి విడుదల పొందితే అప్పుడు జీవుడు ప్రయాణాలు చేయటం ఆగిపోతుంది. మరణానంతరం ఏ జీవుడు అయితే ప్రయాణం చేస్తున్నాడో నీవు ఆత్మనిష్టతోటి వాడిలోని జీవలక్షణాలను తొలగిస్తే వాడి ప్రయాణాలు ఆగిపోతాయి. జీవలక్షణాలు ఉండే జీవుడుప్రయాణం చేస్తాడు, జీవలక్షణాలు నశిస్తే ఆజీవుడే హృదయాకారం చెందుతాడు. అంతటా నిండి ఉంటాడు. అంతటా నిండి ఉండేది ఆత్మ. అంతటా నిండి ఉండేది బ్రహ్మం. ప్రయాణాలు చేసేవాడు జీవుడు. నీవు అంతటా నిండి ఉండాలంటే, శాంతిగా ఉండాలంటే జీవలక్షణాలనుండి విడుదల పొందాలి. మీరు ఎవరో మీకు తెలిస్తే సుజ్ఞానం. మీ స్వరూపజ్ఞానమే సుజ్ఞానం. మీరు ఎవరో మీకు తెలియకపోతే మీరు భౌతికంగా ఎంత వ్యవహారిక జ్ఞానమును సంపాదించినా అది అజ్ఞానం. భౌతికమైన సంపదలు నీదేహానికి కంఫర్టును ఇస్తాయి. ఆత్మజ్ఞానానికి భౌతిక సంపదలు ఉపయోగపడవు. ఆత్మజ్ఞానము నీకు లేకపోతే నీకు భౌతికమైన సంపదలు ఎన్ని ఉన్నప్పటికీ అవి నిప్పులో పెట్టిన కట్టెలతో సమానము. నిప్పులో పెట్టిన కట్టెలకు ఏగతి పడుతుందో ఆత్మజ్ఞానము లేని భౌతిక సంపదలకు కూడా అటువంటి గతే పడుతుంది.

భగవంతుడికి, గురువుకి మనలను అనుగ్రహించే శక్తి ఉంది. వారివలన మనకు సుఖం, శాంతి వస్తుంది. సైన్స్ వలన నీ దేహానికి కంఫర్టు వస్తుంది గాని మనస్సుకు కంట్రోలు రాదు. సైన్స్ అవసరమే గాని సైన్సుకు మానవుడిని అనుగ్రహించే శక్తిలేదు. ఈ సృష్టికి ఆధారముగా ఉన్న సత్యమును, ఆత్మను ఎవడైతే తానుగా అనుభవంలోనికి తెచ్చుకొన్నాడో వాడు మాత్రమే మానవ జాతిని అనుగ్రహించగలడు. లోకాన్ని శాంతితో తడపగలడు. సమాజం యొక్క చైతన్యస్థాయిని పెంచగలడు. జీవితంలో మనకు ఎవరైనా ఉపకారం చేస్తే, మనకు మంచి చేస్తే మనం జ్ఞాపకం పెట్టుకోవాలి. అపకారం చేస్తే మర్చిపోవాలి. కృతజ్ఞత వలన, సహనం వలన చైతన్యస్థాయిపెరుగుతుంది. దారిద్ర్యం వలన మనకు దుఃఖంవస్తుంది. కాని దారిద్ర్యం వలన వచ్చేదుఃఖం కంటే అశాంతి వలన వచ్చే దుఃఖంను మీరు భరించలేరు. అందువలన శాంతిని పొందటానికి ప్రయత్నం చేయండి.

కామేశ్వరీ ఆయుర్వేద సంస్థానము

ఆయుర్వేదాచార్య

**అకొండి సత్యనారాయణ శాస్త్రి**

ఐ. పోలవరం. **533 220**

*శ్రీ సచ్చితానంద స్వరూపులు శ్రీశ్రీశ్రీ నాన్నగార్కి అకొండి సత్యనారాయణ శాస్త్రి వ్రాసుకొను లేఖాంశములు. చాలా అదృష్టవంతుడను " రమణ భాస్కర " మమ్మల్ని ఆశీర్వదించింది. ఎంతో ఆనందమయినది. ఇది నిజమా? కలా? అనిపించింది. ఎందుచేతనంటే మేము ప్రతి రోజు సాయం సంధ్యలో సహస్ర నామాలు చదువుకొని ఒక అద్వైతాన్ని ఆకళింప చేసుకొందుకు ఒక రచన చదువుకొంటూ ఉంటాము. మొన్నటి దాకా శంకరాద్వైతాన్ని, తరువాత రామకృష్ణా బోధామృతాన్ని చదువుకొని ఆస్వాదించుకొంటూ తరువాత రమణభాస్కరమును ప్రకాశింప చేసుకోవాలని అనుకొన్నాము. తడవుగా అది మా సన్నిధానంలోకి వచ్చేసింది. మా సత్సంగం అంతా ఎంతో ఆశ్చర్యానందాన్ని అందుకొంది. అంతటా తానై జ్ఞానామృత వృష్టిని కురిపించుచున్న శ్రీరమణుల అనుగ్రహం మా అంతరంగాన్ని అర్థం చేసుకొందేమో ! తనకు తానై మాదగ్గరకు వచ్చి మమ్మల్ని ఆశీర్వదించింది. మా అదృష్టమునకు ఇదే పెద్ద నిదర్శనము.*